సీరియల్ కథ

# మరో ప్రపంచం

'కినిమా'

నాలుగవ అధ్యాయం

తలవనితలంపుగా పోర్టర్లు కుదిరారుకాబోలనుకున్నాడు విక్రమ్. అప్పుడే ఇసంతా విడిచిపోవడమా అని అతని మనసు చివుక్కుమన్నది. "ఏమిటి వార్త?" అన్నాడతను.

ఎంతో నిశ్చలంగా ఉండే చాంగ్‌కూడా ఉద్వేగంలో ఉన్నట్టు కనబడ్డాడు. "తమకు నా అభివాదాలు," అన్నాడాయన. "ఇందులో నాకుకూడా వంతున్నందుకు నేను సంతోషిస్తున్నాను. నేను ప్రేరేపించినమీదటనే మఠాధిపతిగారు ఈ నిర్ణయానికి వచ్చారు. ఆయన మిమ్మల్ని వెంటనే చూడాలన్నారు."

విక్రమ్ ఆయనకేసి అనుమానంగా చూస్తూ, "మీరు చెప్పేది నా కర్థంకాలేదు. ఏం జరిగింది" అన్నాడు.

"మఠాధిపతి మీకోసం కబురుపెట్టారు."

"అది నాకర్థమయింది. ఈ హడావుడి దేనికని."

"ఎందుకంటే, ఇది అపూర్వమైన విషయం, ఎన్నడూ జరగనిది. మిమ్మల్ని పిలిపించమన్న నేనే ఇది ఇంతలో జరుగుతుందని నమ్మలేదు. మీరు వచ్చి ఇంకా పక్షం రోజులు కాలేదు. అప్పుడే వారు మీకు దర్శనమిస్తున్నారు! ఇంత త్వరలో ఇటువంటిది ఎన్నడూ సంభవించలేదు."

"నాకింకా అయోమయంగా ఉంది. నేను మీ మఠాధిపతిని చూస్తానుసరే. అంతేనా? ఇంకేమైనా ఉందా?"

"అది చాలదా?"

విక్రం నవ్వి, "చాలదని నా భావంకాదు. నాకు జరుగుతున్న గౌరవాన్ని నేను తెలుసుకున్నాను. కాని మొదటనే ననుకున్నది మరో విషయం—ఆ సంగతి పోనివ్వండి. నాకు వారి దర్శనం ఎప్పుడవుతుంది?"

"ఎప్పుడోనా? ఇప్పుడే: నా వెంట మీరు వారివద్దకు వస్తున్నారు."

"పొద్దుపోయిందేమో?"

"ఫరవాలేదు. అయ్యా, త్వరలోనే మీరింకా చాలా విషయాలు తెలుసుకుంటారు. ఎన్నో సంగతులనుగురించి మీరడగడమూ, నేను చెప్పలేకపోవడమూ జరిగింది. ఇది నాకూ బాధగానే ఉండింది. ఇప్పుడదంతా తీరిపోయింది. ఇకముందు నేను పస్తాయించవలసిన అగత్యం ఉండదు."

"అదంతా పోనివ్వండి. పోదాం, పదండి. నేను సిద్ధంగా ఉన్నాను."

చాంగ్ వెంట నడుస్తున్నప్పుడు విక్రంలో ఎట్టి వికారమూలేదు. కాని అతని వాలకంలో ఆత్రంమటుకున్నది. ఒక్కొక్క నడవే దాటిపోతున్నకొద్దీ అది హెచ్చుతున్నది. ఈ ప్రదేశంయొక్క రహస్యాలు తెలుసుకునే సమయం దగ్గిరికి వస్తోంది.

ఇప్పుడు చాంగ్ విక్రంను కొత్త గదులవెంబడి తీసుకుపోతున్నాడు. ఇవి పూర్వం చూడనివి. దీపపుకాంతిలో అస్పష్టంగా, అందంగా ఉన్నాయి. వారిరువురూ వంకర మెట్లమీదుగా పై అంతస్థుకు చేరారు. చాంగ్ ఒక తలుపు తట్టాడోలేదో మరుక్షణమే అది తెరుచుకుంది. ఇద్దరూ లోపలికి వెళ్ళారు. ఇక్కడ చాలా వెచ్చగా ఉంది. గాలి సంచారం ఏమాత్రమూ ఉన్నట్టులేదు. చివరకు వారొక తలుపుదగ్గిరికి చేరారు. ఆ తలుపు తెరిచినట్టయితే లోపలినుంచి వేడి ఆవిరి మీదికివచ్చేలాగ తోచింది విక్రంకు.

"మఠాధిపతి మీకు ఏకాంతంగా దర్శనమిస్తారు," అని చాంగ్ విక్రంతో రహస్యంగా అన్నాడు. విక్రంకోసం చాంగ్ ఆ తలుపుతెరిచి, అతన్ని లోపలికి పోనిచ్చి వెంటనే నిశ్శబ్దంగా మళ్ళీ తలుపు మూసేశాడు.

విక్రం అనుమానంగా నిలబడ్డాడు. లోపల అమిత ఉక్కగానే కాక చీకటి చీకటిగాకూడా వుంది. కొంత కాలానికిగాని కళ్ళు ఈ చీకటికి అలవాటుపడలేవు. గది ఆటే ఎత్తులేదు. చుట్టూ నల్లని తెరలున్నాయి. మామూలు బల్లా, కుర్చీలూ మాత్రమే గదిలో ఉన్నాయి. ఒక కుర్చీపై



ప్రతిభావారి కొత్తచిత్రంలో ముక్కామల

ఒక పొట్టి, తెల్లని, ముసలిమనిషి, ముడతలుపడిన మొహంతో నిశ్చలంగా కూచుని ఉన్నాడు. ఆయన చీనా వారి దుస్తులు ధరించి ఉన్నాడు.

విక్రం రెండడుగులు ముందుకువేసి మళ్ళీ ఆగాడు.

"మీరేనా విక్రం?" అన్నాడు వృద్ధుడు, వినపడీ వినపడని గొంతుతో, స్వచ్ఛమైన హిందీ ఉచ్చారణతో.

విక్రంకు ఆవ్యక్తిలో ఏదో దైవాంశం స్ఫురించింది. ఉక్కవల్ల తనకు భ్రమకలుగుతున్నదేమో అనుకున్నాడు.

"అవును," అన్నాడతను.

"మిమ్మల్ని చూసినందుకు చాలా సంతోషం. మీతో మాట్లాడదామని కబురుచేశాను. నాపక్కన కూచోండి. నేను వృద్ధుణ్ణి. నావల్ల మీకేమీ భయంలేదు."

"నాకోసం కబురుచేయడం నాకొక పెద్ద మహా భాగ్యంగా భావిస్తున్నాను," అన్నాడు విక్రం.

"నాచూపు అంతగా ఆనదు, విక్రం. కాని నేను అచ్చగా కంటితోనేగాక మనసుతోకూడా నిన్ను చూడ గలుగుతున్నానని నమ్ము. మీకు షాంగ్రిలాలో అన్ని సరిగా అమరుతున్నాయా?"

"నిరభ్యంతరంగా."

"చాంగ్ శక్తివంచనలేకుండా చాతనయినమటుకు మీకే లోపం రాకుండా చూసే ఉంటాడు. అతనిని నువు చాలా విషయాలడిగావట."

"ఔను, చాలా విషయాలు తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది."

"కొంచెం ఓపికగావింటే ఈ స్థలవిశేషాలు సంగ్రహంగా చెబుతాను."

"అంతకంటె నేను కోరేదిలేదు."

"నాకు తెలుసు. కాని, ముందుగా—"

వృద్ధుడు తన చేతిని కనపడీ కనపడకుండా కదిలించాడు. మరుక్షణమే ఒక నౌకరు వచ్చి టీకి ఏర్పాట్లు చేశాడు. వృద్ధుడి సంకేతం ఏవిధంగా అవతలికి చేరిందో విక్రం ఊహించలేకపోయాడు.

చీనావారి తేనీటిసేవనపు ఆచారాలు విక్రంకు ఇష్టం.

"మా ఆచారాలు నీకు తెలుసునన్నమాట?" అన్నాడు వృద్ధుడు.

"నేను కొంతకాలం చీనాలో ఉన్నాను."

"ఈ సంగతి చాంగ్‌తో చెప్పలేదు. ఏం?"

ఎందుకు చెప్పలేదో విక్రంకుకూడా స్పష్టంగా తెలియదు.

"మీతో చెబుదామని నా ఉద్దేశమై ఉండవచ్చు." అన్నాడతను.

"మన స్నేహం వికసించడానికి అంతకంటె మంచి కారణం అవసరంలేదు. ఈ తేనీటిరుచి ఎలాఉంది? చీనాలో చాలారకాల తేయాకు, వివిధ రుచులతో కూడినది తయారవుతుంది. కాని మా లోయల పెరిగిన ఈ ఆకు వాటికి వేటికీ తీసిపోదని నా నమ్మకం."

విక్రం కొద్దిగా తేనీరు రుచిచూసి, "చాలా బాగున్నది. నాకీరుచి కొత్తకూడాను" అన్నాడు.

"అవును. దీనిరుచి పూర్తిగా అనుభవించాలంటే కొంచెం కొంచెంగా, అభిమానంతో సేవించాలి. చెరుకుగడ తినేటప్పుడు దానిరుచిని పూర్తిగా అనుభవించడానికై తాను

తాపీగా, పూర్ణబుద్ధితో ఉపక్రమిస్తానని పదిహేను శతాబ్దాల క్రితం కౌకాయ్‌చౌ అన్నాడు. చీనా సాహిత్యంతో ఏమైనా పరిచయం ఉందా?''

తేనీటి సేవనం పూర్తి అయేదాకా సంభాషణ ఇదే ధోరణిలో నడుస్తుందని విక్రం ఎరుగును. అది పూర్తి అయాకగాని అసలువిషయం రాదు. కౌకాయ్‌చౌలాగే విక్రం కూడా అసలుదానికోసం వేచిఉండే కళ బాగా తెలిసినవాడు. ఎట్లాగయితేనేం టీ అయింది. వృద్ధుడు మళ్ళీ తనచేతిని కొద్దిగా ఆడించాడు. నౌకరువచ్చి బల్ల శుభ్రంచేసి వెళ్లాడు.

వృద్ధుడు మాట్లాడనారంభించాడు.

"శ్రీ కృష్ణచైతన్యస్వామి నిర్యాణానంతరం ఆయన ప్రబోధాలు మిగిలినచోట్లకంటె వంగదేశంలో బాగా ప్రచారమయాయి. దీనికి కారణం వంగదేశం వెళ్ళిన నిత్యానందుడు మొదలైనవారి కృషే అనటానికి ఎట్టి సందేహమూ లేదు. ఈ శిష్యులకు శిష్యులైనవారిలో వాసుదేవుడని ఒకాయన ఉండేవాడు. ఈయన తన జీవితమంతా దేశాటనచేసి, చైతన్యస్వామి తిరిగిన స్థలాలన్నీతిరిగి ఆయన గాథలన్నిటినీ సేకరించి స్వగ్రామానికి తిరిగివచ్చి అందరికీ వాటిని నిత్యమూ చెబుతూండేవాడు. ఆయనకు ఒకడే కుమారుడు కాని ఆ కుమారునికి ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు కలిగారు. తాతగారు తన మనమరాలికి నిమి అనీ, మనమలకు విశ్వంభరుడు, గౌరాంగుడు, చైతన్యుడు అనీ—అన్నీ చైతన్యస్వామి పేర్లే—పెట్టించాడు. కాని అందరిలోకీ గౌరాంగుడికి తాతగారివద్ద మాలిమి. అతనికే ఆయన చైతన్యస్వామి గాథలు మరీమరీ చెబుతూండేవాడు. ఆ కుర్రవాడే వాటిని అందరికన్న ఎక్కువ శ్రద్ధగా ఆలకిస్తూ ఉండేవాడు. చైతన్యస్వామి పేర్లన్నిటిలోకి ఏది బాగున్నదని పిల్లలలో తగాదా వస్తూండేది. అప్పుడు తాత "గౌరాంగుడి పేరే బాగుంది" అనేవాడు. కుర్రవాడు తెల్లనివాడు కావడమూ, వాడుకూడా చైతన్యస్వామిలాగా ఫాల్గుణ పౌర్ణమినాడే పుట్టడమూ తాతగారికి మరింత గర్వకారణంగా ఉండేది. తాను చైతన్యస్వామివారి అపరావతారాన్నని కూడా గౌరాంగుడు అప్పుడప్పుడూ అనుకుంటూఉండేవాడు.

"పెద్దవాడవుతున్నకొద్దీ గౌరాంగుడికొక ఆశకలిగింది. చైతన్యస్వామి త్రిమంద్రంలో భిక్షురామగిరిఅనే బౌద్ధుణ్ణి ఏ విధంగా కృష్ణభక్తుడుగా మార్చేశారో తాతగారు వింతగా చెప్పేవారు. అదేవిధంగా తానుకూడా బౌద్ధులనందరినీ కృష్ణభక్తులను చేయాలని గౌరాంగుడికుండేది. కాని ఈ కోరిక నెరవేరేలోపలనే గౌరాంగుడు వార్ధక్యదశలో ప్రవేశించాడు.




ప్రతిభావారి కొత్తచిత్రంలో అంజలి

"పదిహేడో శతాబ్దం ఆఖరులో కొందరు వంగదేశీయులు చీనాదేశానికీ, త్రివిష్టపానికీ, బయలుదేరారు. ఈ దేశాలలో బౌద్ధం విశేషంగా వ్యాప్తిలో ఉన్నదని గౌరాంగుడెరుగును. తానుకూడా వారితోబాటు తన అరవై అయిదవ ఏట బయలుదేరాడు. ఈ ప్రయాణంనుంచి తిరిగివస్తానన్న ఆశగాని, గమ్యస్థానం చేరుకుంటానన్న ఆశగాని అతనికి లేదు. కాకపోతే తాను చైతన్యుడి అపరావతారమై ఉండవచ్చుననే భ్రమ ఇంకాపట్టి పీడిస్తూనే ఉన్నది.

“ గౌరాంగుడివెంట త్రివిష్టపానికి బయలుదేరినవారిలో కొంవరు కొంతదూరంవచ్చి తిరిగి వెళ్ళిపోయినారు. మిగిలినవారిలో కొందరు అక్కడక్కడా ఆహ్వానాలుపొంది నిలిచిపోయి శిష్యులను సంపాదించారు. గౌరాంగుడూ మరి ముగ్గురుమాత్రమే హిమాలయ పర్వతపాదాలవద్ద మిగిలారు. నేపాళదేశం ఆనాడు మాంత్రికులకు ప్రసిద్ధి. ఒక మాంత్రికుడు వీరు నలుగురికీ కొన్ని ఓషధులిచ్చి వాటి మహిమవల్ల హిమాలయ పంక్తులను దాటగలుగుతారన్నాడు. నలుగురూ నమ్మారు. ఓషధీ ప్రయోగాలు తెలుసుకుని నలుగురూ హిమాలయ శ్రేణులను ఎక్కి దిగసాగారు. ఔషధులేమో మహిమగలవిగానే కనబడ్డాయి. ఎన్నో మాసాలు గడిచాయి. ప్రయాణం సాగింది. అయినా ఎవరూ జబ్బుపడలేదు. రానురాను హిమగిరి జనశూన్యంకాసాగింది. చలి తుఫానులు జాస్తిఅయాయి. భయంకరమైన హిమపతనాలు ప్రాణాలుతీసేలాగ కనిపించాయి. ప్రయాణీకులను ఆకలి దప్పులు విపరీతంగా బాధించసాగాయి. గౌరాంగుడు తప్ప మిగిలినవారు భయపడిపోయారు. అతడే మిగిలినవారిని ప్రోత్సాహించి ముందుకు దారితీశాడు.

“ ఈ స్థితిలో ఒక ఉపద్రవం జరిగింది. నేపాళ సిద్ధుడిచ్చిన ఓషధులు ఎక్కడో పడిపోయాయి, ప్రయాణీకుల

వాహినీవారి “ పెద్దమనుషులు ”. గౌరీనాథశాస్త్రి, వంగర, ఎ. వి. సుబ్బారావు చదలవాడ కుటుంబరావు



కిప్పుడు తిరుగుముఖం పట్టటానికైనా సాహసం చాలలేదు. ఒక్కొక్కరే దారివెంట మరణించసాగారు. చివరకు గౌరాంగుడొక్కడే మిగిలాడు. అతను ముందుకే వెళ్లాడు. అతను ఏదారిన వెళ్ళాడో, ఏ కష్టాలుపడ్డాడో ఎవరికీ తెలియలేదు. ఆఖరుకు అతనుకూడా పడిపోయాడు. ఆ స్థలం మీ విమానం పడిపోయిన ప్రాంతాలనే ఉంది.

"అయితే గౌరాంగుడు చావలేదు, ఈ లోయలోని మనుష్యులు అతనిని చేరదీసి ఉపచారాలు చేశారు. ఆ వయసులోకూడా అతని ఆరోగ్యం చక్కబడి యథాస్థితికి వచ్చింది. అతనికి పునర్జన్మ ఎత్తినట్టయింది. లోయలో వారికిచైతన్యస్వామి ప్రబోధాలు అందజేశాడు. వారుకూడా ఉత్సాహంతో స్వీకరించారు. అప్పటికే ఈ ఆరామాలున్న చోట శిథిలమైపోతున్న పాత ఆరామాలుండేవి. వీటిని చైతన్యారామాలు చేసే ఉద్దేశంతో గౌరాంగుడు స్వయంగా వీటిని పునర్నిర్మించాడు. తాను వీటిలోనే నివాసం ఏర్పరచుకున్నాడు,

"వార్థక్యం ముంచుకు రావటంవల్లనో, వాతావరణం మార్పువల్లనో గౌరాంగుడి మత విశ్వాసాలలోనూ, ప్రవర్తనలోనూ పరివర్తన కలగసాగింది. లోయ ప్రజలు అతన్ని దేవుడల్లే చూసి ఆరాధిస్తున్నప్పటికీ, అతనికీ వారికీ గల సంబంధం ప్రవక్తకూ ప్రజలకూ ఉండేటటువంటిదిగా కాక మరొక విధంగా మారసాగింది. అతని దృక్పథం కూడా లోయలోకి ముడుచుకు పోతున్నట్టయింది. లోయలో ప్రజలు అతని బోధలు మరిచిపోతున్నట్టు కూడా కనపడ్డారు, కాని అతనిపట్ల వారిభక్తి ఏమాత్రమూ తగ్గలేదు.

"గౌరాంగుడు షాంగ్రిలాలోని బౌద్ధమత గ్రంథాలు చదవసాగాడు. వాటిని ఖండించాలని అతని ఉద్దేశం. బౌద్ధమత ఖండన అన్నపేరుతో ఒక చిన్న గ్రంథంకూడా రచించాడు. కాని అది అంత నిశితమైన విమర్శకాదు. ఈ గ్రంథం రచించేనాటికే అతనికి నూరేళ్ళు నిండాయి. మృత్యువుకోసం ఎదురు చూస్తున్నాడు. ఆరామంలో ఆయన వెంటఉండినవారు చాలామంది చనిపోయారు. కాని జీవితం ప్రశాంతంగా సాగుతున్నది. లోయలో ప్రజలు ఆయనకు కావలిసిన అన్నవస్త్రాలు అందజేసేవారు.



"మహాత్మా"లో జాగీర్దార్, రేఖా

"చివరకు గౌరాంగుడికి మృత్యుదేవి ఆహ్వానం వచ్చింది. ఆయన ఈ గదిలోనే తన మరణశయ్యపై పడుకుని గవాక్షంలోనుంచి కారకల్ శృంగాన్ని మసక కళ్ళతో వీక్షించాడు. అయితే ఆయన మనోనేత్రం మటుకు నిర్మలంగా, ఎప్పటికన్న స్వచ్ఛంగాఉంది. గతమంతా ప్రస్ఫుటంగా ఈ మనోనేత్రం ముందు గోచరించింది. ఆయన మృత్యుసన్నిధికి వెళ్ళటానికి మానసికంగా సంసిద్ధుడైనాడు. తన హితులనూ, శిష్యులనూ పిలిచి వారికి అంత్య సందేశం ఇచ్చి తనను ఏకాంతంగా మరణించనిమ్మన్నాడు. ఈ ఏకాంతంలో ఆయన అనేక వారాలపాటు మృత్యుసాన్నిధ్యం చవిచూచి ...తిరిగి కోలుకోసాగాడు. అప్పటి కాయన వయసు అష్టోత్తరశతం.

"మృత్యు ముఖంనుంచి ఆయన రిక్తహస్తాలతో తిరిగి రాలేదు. ఆయన కొక దివ్యదర్శనం కలిగింది. దాని వివరాలు తరవాత చెబుతాను. గౌరాంగుడు మరొక జన్మ ఎత్తాడు. చావునుంచి కోలుకోవటంలో ఆయన కొత్తరకం సంయమం ప్రారంభించేవాడు. ఆ సంయమంతోబాటు



"మహాత్మా"లో డేవిడ్, జాగీర్దార్

ఆయన కొన్ని నిషాద్రవ్యాలకుకూడా అలవాటు పడ్డాడు. ఈ రెంటి కలయికతో ఆయన రహస్యసాధన ఆరంభించాడు. లోయలోవారు షాంగ్రిలాకువచ్చి ఆయన దర్శనం చేసుకుని, ఆయనకు అవసరమైన సేవలు చేసిపోతూండేవారు. ఆయన వారిని దీవించి పంపేవాడు. ఆయనకు అమానుష శక్తులున్నాయనీ, ఆయన భగవంతుడనీ, ఒక్కొక్క రాత్రి గాలిలోతేలి కారకాల్ పర్వతశృంగం మీదికి వెళ్ళి విహరించివస్తాడనీ వదంతులు పుట్టాయి. ఇవన్నీ నిజంకాదు. ఆయన వ్యాధులు కుదిర్చేవాడన్నదీ నిజంకాదు. అయినా ఆయనవద్దకు వచ్చి వెళ్ళినరోగులు ఒక్కొకసారి కోలుకొనేవారు.....పందొమ్మిదో శతాబ్దారంభానికి ఆయన ఇంకా జీవించే ఉన్నాడు.

"ఆయన తన కాలాన్ని ఎట్లా గడిపాడని సందేహం కలగవచ్చు. పుస్తకపఠనంలోనూ, ఇతర భాషలు నేర్చుకోవటంలోనూ ఆయన కాలం సుఖంగా గడిచిపోయింది. చైతన్య స్వామిలాగే ఈయనకుకూడా మొదటినుంచీ కొంత పాండిత్యప్రకర్ష లేకపోలేదు. కాని అది ప్రచారం మాటున అణిగిపడివుండి అంతగా రాణించలేదు. ఈ నూతన జీవితంలో అది పైకివచ్చింది.

"1804 లో గౌరాంగుడికి తోడుదొరికింది. ఆ ఏడు మరొక వ్యక్తి దారితప్పి షాంగ్రిలాకు వచ్చాడు, ఇతను హెన్షెల్ అనే ఆస్ట్రియావాడు. యుద్ధాలలో తనకున్నదంతా కోల్పోయి ధనార్జనకోసం ప్రపంచంమీద పడ్డాడు. ఇక్కడి ఆచారంప్రకారం అతనికి లోయలోప్రజలు ఆతిథ్యం ఇచ్చారు. అతని దృష్టి ఇక్కడి బంగారుగనులమీద పడింది. వీలయినంత బంగారం మూటగట్టుకుని స్వదేశం తిరిగిపోదామని అతని ఆశ. కాని అతను వెళ్ళలేదు. ఈ లోయా, ఇక్కడి శాంతీ, ఈతిబాధలు లేకపోవడమూ, ఇదంతా అతనిపై తన ప్రభావాన్ని చూపింది. అతను తిరుగుప్రయాణం వాయిదాలువేస్తూవచ్చాడు. గౌరాంగుణ్ణి గురించిన పుకార్లన్నీ అతనిచెవిని పడ్డాయి. ఒకనాడు కొండ ఎక్కి షాంగ్రిలాకు వచ్చాడు, గౌరాంగుణ్ణి కలుసుకున్నాడు.

"ఈ సమావేశం చాలా ముఖ్యమైనది. ఈ ఇరువురి మధ్యా ఏర్పడిన బంధాన్ని వివరించను. అది అవిచ్ఛిన్నమైనది. గౌరాంగుడు తన విజ్ఞానాన్నీ, ఆధ్యాత్మికానందాన్నీ, తన హృదయంలో దాగివున్న మహోన్నత ఆశయాన్నీ హెన్షెల్‌కు చెప్పాడు."

విక్రం చిన్న గొంతుతో, "అదేమిటో నాకు బోధపడలేదు," అన్నాడు.

"అవును. ఆ విషయంకూడా తరవాత వివరిస్తాను.... హెన్షెల్ ఈ ఆశ్రమానికి ప్రాణంపోశాడు. దీనికొక క్రమమూ, నియమావళీ తయారుచేశాడు. ప్రతి సంస్థ యొక్క పురోభివృద్ధికీ అవి ఎంతో అవసరం. ఈ ఆశ్రమానికి కావలసిన వస్తువులు బయటినుంచి వచ్చేటందుకవసరమైన ఏర్పాట్లను అతనే చేశాడు. ఈ ప్రదేశాన్ని సాయుధంగా ముట్టడించడంగాని, దీనిపై దాడిచేయడంగాని సాధ్యమైనపనికాదు. అందుచేత వ్యక్తులెవరైనా ఈ సమాజంలోకి రాదలిస్తే స్వేచ్ఛగా రానివ్వవచ్చునని హెన్షెల్ నిర్ణయించాడు. ఆవిధంగా అనేకమంది, ప్రాచ్యులూ, పాశ్చాత్యులూకూడా అప్పుడొకరూ, అప్పుడొకరూ రాసాగారు. కాని వీరి విషయంలో ఒకేఒక నియమమున్నది. దానికి కట్టుబడి ఎవరైనా ఇక్కడికి రావచ్చు.

"ఈ ఆశ్రమానికి గౌరాంగుడు చేసిన సేవకు హెన్షెల్ చేసిన సేవ ఏమాత్రమూ తీసిపోదు. అతను చనిపోయేలోపుగా తన పని ముగించగలిగాడు."

"హెన్షెల్ మరణించాడా?" అన్నాడు విక్రం.

"అవును. మీ సిపాయికలహం జరిగిన ఏడే అతను అకాలమరణం వాతపడ్డాడు. అతని చిత్తరువు చూపుతాను."

వృద్ధుడు మళ్ళీ చెయ్యి కదిలించాడు. నౌకరు వచ్చి ఒకపక్క తెరను కొంచెం తొలగించాడు. దీపపు కాంతి చిత్తరువుపై పడింది. విక్రం లేచివెళ్ళి ఆ చిత్తరువును పరిశీలించాడు. అది అంత పెద్దదికాదు. అది ఒక యువకుడి చిత్రంలా ఉంది.

"హెన్షెల్ కొద్దిరోజులకు చనిపోతాడనగా చీనా చిత్రకారుడొకడు దానిని చిత్రించాడు. అందులో హెన్షెల్ పోలిక చాలా నిర్దుష్టంగా ఉన్నది."

విక్రం తిరిగివచ్చి యథాస్థానంలో కూచుంటూ, "కాని ఇతను 1804 లో యువకుడన్నారు. అతను చనిపోయినది—ఇతను ఏవిధంగా చనిపోయాడు?"

"ఇంగ్లీషువాడొకడు అతనిని కాల్చిచంపాడు. అతను కూడా ప్రపంచపర్యటనచేస్తూ వచ్చినవాడే."

"కాల్చటానికి కారణం?"

"పోర్టర్ల విషయం ఘర్షణ జరిగింది. ఇక్కడికి వచ్చేవారు పాటించవలసిన నియమాన్ని హెన్షెల్ ఆ ఇంగ్లీషువాడికి తెలిపాడు. ఈ భారం ఇప్పుడునాపై పడింది. ఆ నియమం ఏమిటా అని ఆశ్చర్యపడుతున్నావా విక్రం?"

"నేనూహించగల ననుకుంటాను"

"నిజమా? ఇంకేమేం ఊహించగలవు?"

"అసంభవంగా కనిపిస్తుంది. కాని నమ్మకుండా ఉండలేకపోతున్నాను. ఎంత ఆశ్చర్యం! ఎంత అసంభావ్యం! అయినా నేను నమ్మగలుగుతున్నాను—"

"ఏమిటి, నాయనా?"

"గౌరాంగస్వామీ, మీరింకా సజీవులై ఉన్నారు!"

మఠాధిపతి మళ్ళీ టీ కోరటంతో సంభాషణ తాత్కాలికంగా తెగిపోయింది. తేనీటి సేవనం పూర్తిఅయే మధ్యకాలంలో వృద్ధుడు సంగీతంగురించి మాట్లాడసాగాడు. అది విక్రం అభిమానవిషయం.

"మా అదృష్టం. ఇక్కడికి వచ్చినవారిలో ఒకడు గొప్ప సంగీతవేత్త. త్యాగరాజస్వామి శిష్యుడు. ఆయనను నువు తప్పక కలుసుకోవాలి," అన్నాడు వృద్ధుడు.

టీ అయిపోగానే విక్రం అసలు విషయానికి వస్తూ, "అయితే మమ్మల్ని ఇక్కడే నిలిపివేయాలని మీ ఉద్దేశమన్నమాట. అదే మీరు చెప్పిన నియమమని నా ఊహ," అన్నాడు.

"నువు సరిగానే ఊహించావు, నాయనా."

"ఇంత ప్రపంచంలో మా నలుగుర్నే ఎట్లా ఏరుకున్నారో నాకు బోధపడలేదు."

"చెబుతాను. మా సమాజం క్షీణించరాదని మా సంకల్పం. వివిధ కాలాలకు, యుగాలకు చెందినవారు మాలో చేరడంవల్ల మాకు లాభం ఉన్నది. కొంతకాలంగా మాకు అతిథులు లేరు. మరణాలు చాలా జరిగాయి. అందుచేత జనసంఖ్య తగ్గసాగింది. ఈ లోటు పూడ్చడానికి మా సభ్యులలో ఒకడు ఒక చిత్రమైన ఉపాయం ఆలోచించాడు. ఈ యువకుడు తాను మా

విఠల్ ప్రొడక్షన్స్‌వారి "రాజలక్ష్మి"లో రేవతి





"నాల్వర్" తమిళచిత్రంలో కుమారి తంగం

సమాజం విడిచి పరిసరదేశాన్ని నివాసంగా ఏర్పరచుకుని అప్పుడప్పుడూ కొత్త పౌరులను తెచ్చే ఉపాయం తల పెట్టాడు. ఈ ఉపాయం వెనకటికాలంలో సాధ్యమైనది కాదు. కాలంతోపాటు మారడానికి మాకూ అభ్యంతరం లేదు. అందుచేత దీనికి ఆమోదించాం.''

"విమానాలమీద జనాభాను కొట్టుకురావడానికి అతన్ని పంపారా?'' అన్నాడు విక్రం విస్మయంతో.

"అతను చాలా సమర్థుడు, నమ్మకస్తుడు. ఈ ఆలోచన అతనిదే. మేము ఆమోదించాం. కొంతకాలం అతను అమెరికాలో విమానచోదనం అభ్యసించవలసివచ్చింది. అతని అకాలమరణానికి మేమంతా సంతాపంచెందాం. టాలూ చాలా యోగ్యుడు.''

"దీనికంతకూ పర్యవసానమేమిటి?"

"గౌరాంగుడు ఈ గదిలో మృత్యువుకోసం ఎదురు చూస్తూ తన జీవితాన్ని పర్యాలోకించాడని చెప్పాను. అతను భవితవ్యాన్నికూడా చూశాడు. జీవితంలో ఆనందం ఇచ్చేది ప్రతిదీ క్షణభంగురంగానే అతనికి తోచింది. కాలంగడిచేకొద్దీ విజ్ఞానంకంటె దౌర్జన్యం అతి త్వరితంగా బలపడుతుందనీ, తాను అనుభవించిన ఆనందాలకుకూడా ప్రపంచంలో తావు లేకుండాపోతుందనీ, కామక్రోధలోభాదులూ, వినాశనేచ్ఛా ప్రబలుతాయనీ, మారణశక్తులూ సాధనాలూ భయంకరంగా అభివృద్ధి అయి, ఒక్క అస్త్రంతో బ్రహ్మాండమైన సేనలు భస్మీపటలమయేరోజులు వస్తాయనీ, మానవజాతి ఆత్మహత్య చేసుకుంటుందనీ, పెకింగ్‌లోని రాజభవనాన్ని ఇంగ్లీషువారు ధ్వంసంచేసిన విధంగా, ప్రపంచంలో అనేక వేల ఏళ్ళుగా సేకరించబడిన సారస్వతమూ, శిల్పమూ, సంగీతమూ విధ్వంసంచేయబడతాయనీ అతనికి తోచింది. అటువంటి అవకాశం లేదంటావా?''

"లేదనలేను.''

"కనుకనే నేనిక్కడ ఉన్నాను. నువ్వూ ఇక్కడ ఉన్నావు. ప్రపంచమంతా వినాశనమయాక మన ఈ చిన్న జగత్తు నిలిచివుంటుందని ఆశింతాం. దుష్టశక్తులు మనని కనికరిస్తాయనికాదు, ఉపేక్షించవచ్చు. అంతే చాలు. ఈలోగా మనం పుస్తకాలనూ, సంగీతాన్నీ భద్రపరుస్తూ, ధ్యానంలో కాలంగడుపుదాం, విజ్ఞానసేకరణచేద్దాం."

"తరువాత?''

"నాయనా, బలవంతులు ఒకరినొకరు ధ్వంసం చేసుకున్నాక ఏసుక్రీస్తు చెప్పినట్టు అమాయకులకు ప్రపంచ పట్టాభిషేకం జరుగుతుంది.''

ప్రసంగం ముగిసింది. విక్రంకు తనచుట్టూ ఉన్న కాంతి అదృశ్యమైనట్టు భావనకలిగింది కాని ఆ కాంతి మానసికమైనది. మఠాధిపతి లేచి నిలబడుతూండడం అతనికళ్ళబడింది. మర్యాదకు ఆయనకు సహాయంచేద్దామని విక్రం ముందుకు అడుగువేశాడు. కాని ఆకస్మికంగా అతనికి బలవత్తరమైన ప్రేరణ ఏదో కలిగి వృద్ధుడిముందు సాష్టాంగపడ్డాడు.

తాను ఆ వృద్ధుడివద్ద ఎట్లా సెలవుపుచ్చుకున్నాడో విక్రంకు తెలియదు. చాంగ్‌వెంట తాను తనగదికి తిరిగి రావడమూ, దారిలో తనకు చలి అనిపించడమూ విక్రంకు కలగా తోచాయి. (సశేషం)